క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాంట్రాక్టర్ బసవరాజు, నాయకులు

ఆదోనిరూరల్: పెద్దతుంబళం గ్రామంలో బుడగజంగాల కలనీకి చెందిన బాదిగ రాముడు బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కాంట్రాక్టర్ బసవరాజు ద్వారా మట్టి ఖర్చులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వైఎస్సార్ బీమా ద్వారా నగదు అందేలా చర్యలు తీసుకుంటామని వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ ఈరన్న, రామ్‌దాసు, విబూతి కుమార్, మోతి బంగారప్ప తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం: మండలంలోని మరళి గ్రామం గుండప్ప కల్లు అంగడి వద్ద కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన ఈడిగ శివకుమార్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శివకుమార్ నుంచి 5 బాక్స్‌లు మొత్తం 480 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒక బైక్‌ను సీజ్ చేసి రిమాండు పంపినట్లు చెప్పారు.

దివ్యాంగులకు వికలత్వ పరీక్షలు



కోసిగి ఆసుపత్రిలో వికలత్వ పరీక్షలు చేస్తున్న డాక్టర్ మల్లికార్జున

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం దివ్యాంగులకు ఆర్థోఫిజీషియన్ డాక్టర్ మల్లికార్జున వికలత్వ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు సదరం సర్టిఫికెట్‌లో వికలత్వ శాతం నమోదు చేస్తామని చెప్పారు. సదరం కింద దరఖాస్తు చేసుకున్న 15 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్ అవసరమైన వారిని ఎమ్మిగనూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు. సదరం సర్టిఫికెట్లను సంబంధిత సచివాలయాలకు పంపుతామని ఆయన పేర్కొన్నారు. కోసిగి వైద్యాధికారి డాక్టర్ నజీర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ నాగేశప్ప

కోసిగి: డిజిటల్ విద్యను సక్రమంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. శనివారం మండలంలోని సజ్జలగుడ్డం, దేవబెట్ట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. అనంతరం పాఠశాలకు కేటాయించి డిజిటల్ టీవీ ద్వారా పాఠ్యంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డిజిటల్ తరగతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

అద్వానీకి భారతరత్నపై హర్షం

ఆదోనిఅర్బన్: బీజేపీ సీనియర్ నేత ఎల్.కె. అద్వానీని భారత అత్యున్నత పురస్కారం భారతరత్నకు ఎంపిక చేయడం పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ అభినవ సర్దార్ పటేల్‌గా కీర్తి పొందిన బీజేపీ పార్టీని పల్లె నుంచి పట్నం దాకా విస్తరించి, అయోధ్య రామమందిర నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నడిపిన అద్వానీకి సముచిత గౌరవం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

కౌతాళం: మండలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి శనివారం సందర్భంగా విశేష పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుదుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి జాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



నాడు - కొత్త పేట కాలనీ రోడ్డు దుస్థితి



నేడు - సీసీ రోడ్డు వేయడంతో ఇలా..

వాడ వాడలో సీసీ రోడ్లు

- నాడు–నేడుతో కోసిగిలో రూ.3.35 కోట్లతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

కోసిగి: ఐదేళ్ల క్రితం వరకు బురద, మురుగు నీటిలోనే రాకపోకలు. గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలను నిర్మించకపోవడంతో రోడ్డు పైనే వృథా, మురుగునీరు ప్రవహించేది. అయినా నాటి పాలకులకు పట్టలేదు.



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చొరవతో మండల కేంద్రం కోసిగిలో వాడ వాడల డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయించారు.

➡ ప్రధానంగా ఏళ్ల తరబడి రోడ్డు వసతి లేక కొత్తపేట కాలనీకి వెళ్లేందుకు కాలనీవాసులు నరకం అనుభవించారు. వారికి కేవలం మెట్ల దారి మాత్రమే ఉండేది.ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో హిందూ గర్ల్స్ ప్రాథమిక పాఠశాల పక్కనే సీసీ రోడ్డు వేయించారు.



నాడు - గానీ వీధిలో రోడులేక, దారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు



నేడు - రోడ్డు వేసి, డ్రైనేజీ ఏర్పాటుచేసిన దృశ్యం

➡ కొండుగానీ వీధిలో మండల గ్రాంట్‌తో డ్రయినేజీ, సీసీ రోడ్డు వేయడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ కాలనీ టీడీపీకి కంచుకోట అని పేరు. అయినప్పటికీ ప్రజల సమస్యలను పరిష్కరించి పక్షపాతం లేని పాలనకు నిర్వచనం చూపింది. గతంలో కాలనీ వాసులు టీడీపీ నాయకులతో మొరపెట్టుకున్నప్పటికీ ఏనాడూ పట్టించుకోలేదు. ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయించారు. ఇలా మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి దాదాపు రూ.3.35 కోట్లు వెచ్చించారు. 3వ వార్డులోని కాశమ్మ గడ్డ కాలనీ, కొత్తపేట కాలనీ, కొండుగానీ వీధి, ఊరువాకిలి, దొరల చావిడి, లక్ష్మమ్మవ్వ, ముస్లీం మైనార్టీ కాలనీ, మార్కండేయ స్వామి దేవాలయం, పెద్ద మజీద్ కాలనీ, కుమ్మరి వీధి, రంగప్ప గట్టు కాలనీ, శ్మశాన వాటికకు తదితర వాడ వాడల రోడ్డు వసతి కల్పించారు. ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారం అవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదోనిరూరల్: మంత్రాలయానికి చెందిన ఆటో డ్రైవర్ విరుపాక్షిపై పండ్ల వ్యాపారి చెన్నారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య శనివారం తెలిపారు. మండలంలోని కుప్పగల్‌కు చెందిన చెన్నారెడ్డి అనే వ్యక్తి ఆదోని పట్టణంలోని సిరుగుప్ప క్రాస్ వద్ద పండ్ల వ్యాపారం చేస్తుండేవాడు. జనవరి 30వ తేదీన అటుగా వెళ్తున్న మంత్రాలయానికి చెందిన విరుపాక్షి ఆటోలో ఎక్కి వస్తుండగా కడితోట క్రాస్ రోడ్డు వద్ద తనను బెదిరించి, తన వద్ద ఉన్న రూ.2,900 నగదును లాక్కున్నాడని బాధితుడు చెన్నారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామ శివారులో శనివారం ఎరుకల వెంకటేష్ నాటుసారా తయారు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 500 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ చెప్పారు. నిందితుడు వెంకటేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

న్యాయవాదుల వెల్ఫేర్ ఫండ్ పెంచాలి

పత్తికొండటౌన్: న్యాయవాదులు మరణిస్తే వారి కుటుంబానికి ఇచ్చే డెత్‌క్లెయిమ్ ప్రస్తుతం ఉన్న రూ.4 లక్షలను రూ.10లక్షలకు పెంచాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం పత్తికొండలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వెల్ఫేర్ స్టాంపు రూ.100 ఉండగా, రూ.250కి పెంచారన్నారు. డెత్‌క్లెయిమ్ బెనిఫిట్ రూ.4 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచారన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- పట్టణలో ప్రగతి కేంద్రాల ప్రారంభం



ప్రగతి యూనిట్ సెంటర్‌లో మిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదోని మెప్మా ప్రాజెక్టు ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి కేంద్రాలను శనివారం ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు ప్రగతి యూనిట్‌లలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిల్పా ఎస్టేట్ పక్కన ఒక కేంద్రం, లేబర్ కాలనీలో మరో సెంటర్‌ను మెప్మా ప్రాజెక్ట్ అధికారిణి సమీరా ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణ సౌకర్యం కల్పించారని చెప్పారు. ప్రగతి యూనిట్ ద్వారా ఒక్కో పొదుపు మహిళకు రూ.2 లక్షల దాకా రుణం మంజూరు చేయడం జరుగుతోందన్నారు. తీసుకున్న రుణంకు అర్ధ రూపాయి వడ్డీ (6శాతం)తో కలిపి 24 నెలల్లోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు ఉపాధికి సంబంధించిన అవకాశాలను కల్పించారని తెలిపారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుమీద, వారి ఖాతాల్లోకే సాయం అందించడం జరుగుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, 19వ వార్డు ఇన్‌చార్జ్ మధు, మెప్మా రీసెర్చ్ పర్సన్స్ లీలావతి, సుశీల, మాధవి, సుజాత, రమాదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ రామలింగేశ్వరయాదవ్, తిమ్మప్ప, రమేష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు ఆత్మీయ వీడ్కోలు



తహసీల్దార్లను సన్మానించిన సబ్‌కలెక్టర్

ఆదోనిరూరల్: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్లకు సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆదోని డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పరిపాలనాధికారి గోవిందొసింగ్, ఆదోని తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎమ్మిగనూరు తహసీల్దార్ కె.ఆంజనేయులు, మంత్రాలయం తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, హొళగుంద తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, గొనెగండ్ల తహసీల్దార్ వేణుగోపాల్ శర్మలు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వీరిని సబ్‌కలెక్టర్ వారి కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ వారికి దుశ్శాలువాలు వేసి పూల మాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు సహజమని, బదిలీపై వెళ్తున్న వీరు భవిష్యత్‌లో ఉన్నతస్థాయి పదవులు పొందాలని ఆకాంక్షించారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్ మంజూరు

ఆదోనిరూరల్: మేజర్ పంచాయతీ మండిగిరికి చెందిన దామ సత్యనారాయణ అనే వ్యక్తి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఈనెల కొత్తగా పింఛన్ మంజూరయ్యింది. ఈ మేరకు శనివారం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వరి, డిజిటల్ అసిస్టెంట్ నరేంద్ర చేతుల మీదుగా పింఛన్ నగదును అందజేశారు. శేషిరెడ్డి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు ఎవరూ అధైర్యపడకుండా, వారిని ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినెలా రూ.10 వేలు పింఛన్‌ను అందించడమే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు.



పింఛన్ రూ.10 వేలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ

ఆలూరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పొదుపు మహిళలకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ సమక్షంలో శనివారం పొదుపు సంఘాలకు చెందిన గ్రామ, మండల ఐక్య సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగవ విడత ఆసరా సొమ్ము రూ 3.4 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరేష్, జిల్లా పొదుపు సంఘాల అధ్యక్షురాలు సీతాబాయి తదితరులు పాల్గొన్నారు.



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

కళాకారులకు ప్రోత్సాహకాలు



జానపద కళాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండలంలోని జానపద, భజన, కోలాటం తదితర కళాకారులకు కసాపురం శ్రీ లక్ష్మీనారాయణ నూతన ఆలయ కమిటీ, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తలారి పరశురాం, తలారి శకుంతల శనివారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాకారులను, వారి గురువులను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఆలయ విశిష్టతను కళాకారులకు వివరించారు.

ఘనంగా మహిళా వైద్యుల దినోత్సవం





వైద్యురాలు అరుణజ్యోతిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది, పత్తికొండలో డాక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దేవనకొండ: మహిళా వైద్యుల దినోత్సవాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.అరుణజ్యోతిని తోటి సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు వైద్యరంగంలో రాణిస్తుండడం శుభపరిణామమని డాక్టర్ కళ్యాణ్ చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రంగస్వామి, సాయిబాబా, హనుమంతమ్మ, శ్రీధర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పత్తికొండలో..

పత్తికొండ రూరల్: మహిళా వైద్యుల దినోత్సవాన్ని శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఘనంగా నిర్వహించారు.ఇటీవల జిల్లాలో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, హెడ్‌నర్సు శాంతలక్ష్మిలకు కేపీఆర్ మైత్రి చారిటబుల్‌ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిప్పగిరి: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 7 లోపు ఆలూరు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 10 వ తరగతి పూర్తయిన వారు కార్యకర్తకు, 7 వ తరగతి పూర్తయిన వారు ఆయా పోస్టులకు అర్హులన్నారు. 21 ఏళ్ల పైబడి.. 35 ఏళ్లలపు ఉన్న స్థానిక మహిళలే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యులకు సన్మానం


ఆదోనిఅర్బన్: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యులను శనివారం బీసీ కార్యాలయంలో ఆర్.దేవిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికైన టి.దేవదాసు, వై.రవికుమార్‌లను దళిత సంఘాల ఆధ్వర్యంలో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. జైభీమ్ సాయిరామ్ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో ఎక్కువగా అంటరానితనం ఎక్కువగా ఉందని, దానిని రూపుమాపాలన్నారు. అలాగే మహిళలపై కూడా దాడులు జరుగుతున్నాయని, చట్టాలను పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు టౌన్ ప్రెసిడెంట్ ఎం.బొబ్బిలి, వైపై వీరేష్, కల్లుపోతుల రవి, మణికంఠ, వీరేష్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న జై భీమ్ నాయకులు

టీబీ డ్యాంలో 9 టీఎంసీల నీరు

హొళగుంద: తుంగభద్ర జలాశయంలో శనివారం ఉదయం 9.632 టీఎంసీల (105.788 టీఎంసీలకు గాను) నీటి నిల్వలున్నాయి. 1,633 అడుగుల పూర్తి మట్టానికి గానూ 1,588.25 అడుగుల వరకు నీరు ఉంది. ఇన్‌ఫ్లో జీరో కాగా, 271 క్యూసెక్కుల నీటిని ఎల్‌బీఎంసీకి వదులుతున్నారు. గతేడాది ఇదే సమయానికి 50 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. తుంగభద్ర జలాశయం నుంచి బళ్లారి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గానూ దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు గత నెల 25 నుంచి వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన టీబీ బోర్డు అధికారులు తిరిగి నిలిపేశారు. ఈ నెలాఖరికల్లా బళ్లారి, కర్నూలు జిల్లా ప్రజల తాగునీరు అవసరాల కోసం నీటిని వదులుతామని అధికారులు తెలిపారు.



తుంగభద్ర జలాశయంలో నిల్వ ఉన్న నీరు

రహదారి నిబంధనలు పాటించాలి

ఆదోనిఅర్బన్: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్టీఓ, అధికారుల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సిసిరదీప్తి జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైకు ర్యాలీ ప్రధాన రహదారుల గుండా నూతన బ్రిడ్జి, పాత బస్టాండ్, ఎమ్మిగనూరు సర్కిల్, ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆర్టీఓ, ఎంవీఐ మాట్లాడారు. బైకుపై వెళ్లేటప్పుడు వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. హెల్మెట్ పెట్టుకున్నప్పుడు లాక్ చేసుకుంటేనే ప్రాణాపాయం ఉండదని, లేకపోతే కిందకు పడినప్పుడు హెల్మెట్ ఎగిరిపోయి తలకు గాయాలపాలై మరణించే అవకాశం ఉందన్నారు. కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ గోపీచంద్, ట్రాఫిక్ సీఐ మంజునాథ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, పోలీసు, ఆర్టీఓ సిబ్బంది పాల్గొన్నారు.



బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్టీఓ నాగేంద్ర, ఎంవీఐ సిసిరాదీప్తి

ఘనంగా గోపాల విఠలదాసు ఆరాధన

ఆదోనిఅర్బన్: దాససాహిత్యుడు గోపాల విఠలదాసు ఆరాధన సందర్భంగా శనివారం స్థానిక మంగరాయ సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగరాయ ఆంజనేయస్వామికి గోపాలవిఠలదాసు విగ్రహానికి ఫల పంచామృతాభిషేకం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి గావించారు. అనంతరం ఆలయ ఆవరణలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. పండితుడు సరస్వతరత్న విద్వాన్ సుస్వరం నాగరాజ ఆచార్యులచే ఆధ్యాత్మిక బోధనలు, గోపాల విఠలదాసు చరిత్రను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి